# చెల్లాయి చెప్పినది—

కె. రామారావు

భయపడుతూ భయపడుతూ, స్నేహితుడు వచ్చాడో లేదో అని- 'జగన్నాథ్' అని దొంగ పిలుపు పిలిచేసరికీ,- ఇప్పటికి—

"ఎవరూ? ఓహో నువ్వా, అన్నయ్యా, రా! అలా నిలబడిపోయావేం" అంటూ చిరునవ్వుతో, సంగీతం పాడుతూన్నట్లాహ్వానించింది జానకి, జగన్నాథ్ చెల్లెలు. మొహమాటపడుతూనే వెళ్ళి గదిలో కూర్చున్నాను.

"అన్నయ్య ఇవాళే ఉత్తరం వ్రాశాడు— కాలేజీ యిరవైయో తారీకున మూస్తారుట. ఇరవై రెండున వస్తానని."

ఇంట్లోకనక జగన్నాథ్ ఉంటే వీళ్ళంతా బయటకన్నా రారు. అంతకుముందు వాళ్ళింటికి చాలాసార్లు వెళ్ళినా, జానకిని, హైమను, రెండు మూడుసార్లు మాత్రమే చూశాను. జానకికి బాతాకానీ అంటే సరదా అని, అట్లాంటివి హైమ కక్కురలేవని, జగన్నాథే చెప్పాడు, ఒకటి రెండు సార్లు బాతాకానీలో. ఒక ఏడాది దేశదిమ్మరిలా తిరిగి, వాళ్ళ ఊరు రావటం ... ఇలా జరిగింది.

ఇంతకుముందు జానకిమీద, జగన్నాథ్ చెప్పిన మాటలబట్టి కొంచెం కోపంగానే ఉండేది. 'అర్థంలేని వాగుడూ అదీని' అని విసుక్కునేవాడు. నాకు మాత్రం ఒకే అభిప్రాయముండేది. మా జగన్నాథం కురూపి. వీళ్ళు సవతి చెల్లెళ్ళా? లేకపోతే ఇంత అందంగా ఎలా ఉంటారని. పరిచయం, అభిప్రాయాల కలయిక లేకపోయేటప్పుడు, దారిపోయేటప్పుడు, ప్రయాణాల్లోనూ, సహజంగా మనల్ని ముగ్ధుల్ని చేసేది శరీరం, దాని అందం కట్టూను. గడపలో నుంచోడానికి, అదో కారణం కూడా ఏమో! ఇది ఇప్పటి భావన. రెండు నిముషాల్లోకల్లా, మళ్ళా గిరుక్కున తిరిగి వచ్చింది.

"కాఫీ తీసుకో! హోటలు ఫలహారం! అమ్మకేం తెలుసును అంత అకస్మాత్తుగా వస్తావని! అందుక వీటితోనే తృప్తిపడు. కాఫీ పోసీ బాగుందా?- ఇంతకీ ఇప్పుడేం చేస్తున్నట్లూ?" ఈ ఊపిరి ఆడని ప్రశ్నలకి సమాధానాలనవసరం. అమాయకమైన చనువు మాత్రం నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసింది

"సరేగాని చెల్లాయ్- అన్నయ్య ఎప్పుడు వస్తాడన్నావ్?"

హైమ చెప్పింది-"ఇరవై రెండున అన్నయ్యా"

హైమ-ఇంకా ఏదో అడగదమో, తనేచెప్పదమో, నిశ్చయించుకోలేక ఆపేసిందిఅక్కడతో.

పది నిముషాలు గడిచాయి. మనస్సు, పరిపరి విధాల మారుతూ వస్తున్నది. వయస్సులో ఉన్న ఆశని కనపడగానే, సౌందర్యపు పోటీలో మార్కులు వేస్తున్నట్లు, చూచే నేను 'అన్నయ్యా' అంటూ అపూయికంగా పిలిచేసరికి మంత్రముగ్ధుణ్ణై బుఱ్ఱ ఎత్తకుండా కూర్చున్నానే! ఇంతేకదా ఎవరైనా- అని ఆలోచిస్తున్నా ఇంకా!

"నీ చెల్లాయిని! నీ చెల్లాయిని!"- అని ఆమె చెప్పక చెప్పింది ఘట్టిగా. ఈమే కాదు, మనతో చదువుకొనే, మసలే ప్రతీ అమ్మాయీ, ఇలాగే మాట్లాడితే కొంటెమాటలకు, కొంటెచూపులకు ఏమాస్కారం ఉంది?

"అన్నయ్యా! 'కొత్త హిందూ లా' ఎట్లా ఉంటుందంటావు? అసలు లా ఎప్పుడమల్లా ఔతుందంటావా?"

"నాకేం, చెల్లాయ్! తప్పకుండా ఔతుంది." యథాలాపంగా అన్నాను.

"అసలు ఎంతవరకూ బాగుందంటావ్?"

"ఏమో! నే పూర్తిగా చదవలేదు. చట్టం అయ్యాకే చదువుదామని ఊరుకొన్నా!" నిజం చెప్పక తప్పింది కాదు.

"మాకు చెందేంతవరకూ బాగానేవుంది-కాని ఏదో ఆ ఇచ్చేదికూడా మరే ఇవ్వాలికదా అన్న ఇది తప్పిస్తే."

"మేం ఇవ్వటమా!"

మాలో భావాలుకూడా, ఇట్టేమార్చే మీకు, మేం ఇవ్వటం ఏమిటిచెప్మా అనిపించింది-ఆమె గాని, "అన్నయ్య ఇంట్లో లేడు" అంటూ అర్థంకాని మందహాసం చేసి, ఓరచూపు చూస్తూ, వెనకజడ ముందర పడేలా, గిరుక్కున తిరిగిందంటే-ఎన్ని రాత్రులు నిద్రలేని కలలుకంటూ పదేపదే జ్ఞాపకం తెచ్చుకొంటూ బాధపడేవాణ్ణి! ఏవేవో సంఘటనలు, సన్నివేశాలు కల్పించుకుని అల్లాంటి వెలావస్తాయూ అని, ఎన్ని పగటికలలు కనేవాడిని!

"ఏం అంటావా?-మా అన్నయ్య, ఒకనాడు మంచిరోజు చూసి ఇవ్వాళనుంచి బడికి వెళ్లకు, అని చెప్పాడు, ఏం అంటే-మన కులంలో, పెద్ద మనిషయాక బడికి వెళ్తే వెలేస్తారు. తండ్రిలేని మనం, అందరికీ లోకువే" అని సానుభూతికరంగా చెప్పాడు.

"పోనీ ఈ ఏడాది పూర్తికానీ, స్కూల్ ఫైనల్ పరీక్షకి కూర్చోనీ" అని బేరం పెట్టాను. పనికిరాదన్నాడు. మా అన్నయ్య రేపో ఎం. ఎల్. ఏ. వో, మినిష్టరో అయి పద్ధతులు చెప్తాడు, అందరూ స్కూల్ ఫైనల్ పాసైతే కాని పెళ్ళికే అనర్హులు-అని. అప్పుడు అంతా ఆ పరీక్ష పాస్ కావాల్సిందే! అంతేగా జరిగేది!"

"మానేస్తే నీకేమైంది తక్కువ?" అన్నాను కొంటెగా.

"ఏమైంది? ఒకయంత్రంగా తయారయ్యాను. మా అమ్మ చెప్పినట్లు అల్లిక, పువ్వులు కుట్టడం రాకపోతే మంచిమొగుడు రాడట మరి! సంగీతమంటే సంగీతం—ఒకటేమిటి అన్నీ చేర్చుకున్నాను-అంతెందు కన్నయ్యా, యింటిచాకిరి అంతటిలోనూ తరిఫీదయ్యాను. ఇదంతా మంచి మొగుడు కోసమే!-అంతటితో ఆగలేదు. రాబోయే మొగుడుకి ఎలాంటి రుచులుంటాయో ఊహించి చెప్పే అమ్మ, అన్నయ్యల మాటలు, తోసెయ్యకుండా, ఇప్పటికి మూడొంతులు, మాటలు తగ్గించి, ఎన్నో రుచులు అలవాటు చేసుకున్నాను."

"భేష్! మంచి పనిచేశావు."

"అంతేకాదు. రేపు నాలుగువేలు పెట్టి, తారాబలం, చంద్రబలం, ముహూర్తం, అన్నీ నిశ్చయంగా మనస్సులో పెట్టుకొని, ఒకాయన నెవరొన్నో తీసుకొచ్చి, మంచివాడని సర్టిఫికేటు యిచ్చి, నచ్చచెప్పి, పెండ్లిచేస్తే,-పిల్లల్ని కనడం మాత్రం నావంతు మిగుల్తుంది!"

"నీ ఉపన్యాసం బాగుంది కాని చెల్లాయ్! మరి నేనూ, ఏ మొగాళ్ళమీద లెక్చర్ చెబుతున్నావో, వాళ్ళ జాతికే చెందుతానుగా!" అని నవ్వుతూ హెచ్చరించాను.

"తెలుసు నన్నయ్యా! కాలేజీలలో చదువితే చెడిపోతారనే అన్నయ్యతో-చెడిపోవడానికైనా స్వతంత్రం ఇవ్వాలిసిందే అని వాదించే అన్నయ్యవని తెలుసు."

"అంటే తలుపు చాటున పొంచుండి మా వాదం వింటావన్నమాట."

"మరి చెడిపోవడానికి కూడా స్వతంత్రం ఉండాల్సిందేగా!" అంది చలోక్తిగా. ఇద్దరం నవ్వుకున్నాం.

"ఐతే నీపెళ్ళి ట్రైనింగు ఎంతవరకూ వచ్చింది?" అన్నాను.

"పెళ్ళి చూపులనాడు చూస్తే సరి" అని నవ్వింది.

"ఐతే హిందూ కోడ్ బిల్ నచ్చలేదన్న మాట!" "నచ్చడానికి నచ్చక పోడానికి, మీరు ఎంతచెబితే అంతేగా! నచ్చమంటే సరేనంటాం! లేకపోతే మానేస్తాం."

"నేనూ మీవిషయం క్షణాక్రిందట అల్లాగే అనుకుంటున్నా. మీరు మమ్మల్ని కీలుబొమ్మలుగా ఆడిస్తారని" అన్నాను, మనస్సులోని మాట.

"అబద్ధమేమో ఆలోచించు! ఏకపత్నీ చట్టం వచ్చాక రెండోపెళ్ళి చేసుకున్నాడొకాయన. దావా తెస్తే ఆమెకు పిచ్చి, అని వాదన. నిజంగా అప్పుడు పిచ్చిలేకపోయినా తరువాతన్నా వచ్చి ఉంటుందామెకు! జ్ఞానంలేకుంటే ఎన్నిపద్ధతులు వచ్చినా ఇంతే! స్వతంత్రం సర్వవిధాలా మేము అలవరచుకొన గలుస్తేనే, ఈ శాసనాలేమన్నా రక్షిస్తాయేమో! దానికి మా అన్నయ్యలాంటి వారు మొదటే గోతులు తీస్తున్నారుగా!"

"చెల్లాయ్! ఓపని చెయ్యి! సినిమాల్లో చేర తున్నావా? చదువు చెప్పిస్తావా? అని బెదిరిస్తే చదువుకే పంపిస్తాను జగన్నాథ్. అంతే కాని, ప్రతీ ఇంట్లోనూ భయమనే భూతానికి జడిసి, తన ఆప్తుల ప్రేమని బలివేస్తాం. లోకం తీరే అంత. వదంతులు, గుసగుసలు, ఆరోపణలు, వైవ స్వరూపాలు కావే! ఈ దయ్యాలకి, ఏ చెల్లెలి ప్రేమో, కూతురి ప్రేమో బలివేస్తాం. నువ్వు ఇంటి మర్యాదకు, అన్నయ్యమీద ప్రేమవలన జడిశావంటే ఓటమి తప్పదు. చదువుకోవా లంటే నాతో చెప్పలేకపోయావా! ఇన్నాళ్లూ వంచేవాడిని కదా! కాని నేను మొగాణ్ణే అన్న మాటకు కోపం తెచ్చుకుని, మళ్ళా చదువు మానకేం అప్పుడు!

"సరే చెల్లాయిలూ! మళ్ళా వస్తాను వారం లోగానే" అంటూ వచ్చేశాను.

పాపం! ఇంత ఇళ్ళల్లో కుస్తీ పట్టివచ్చే అమ్మాయిలమీద కాలేజీల్లో కావల్సినన్ని వదంతులు వేస్తాం. సగంపైగా నిజముండదు కదా అనుకుంటూ బస చేరుకున్నాను

# ★ చేచేతులారా.... ★

## వై. ఎం. శర్మ

"అమ్మను నాన్నారు, ఏమీ అనలేదు మామయ్యా! అలా చెయ్యకూడదమ్మా అని చెల్లాయినే మందలించారు గాని. పాపం చెల్లాయి చెంపమీద అమ్మ ఐదువేళ్లూ అతుక్కుపోయినై! చెల్లాయి తప్పేం లేదు మామయ్యా, అంతా ఆ కొంటెకోణంగి సీతాం చేసిన చిలిపితనం తప్పు!" కన్నీళ్ళు గిర్రున తిరిగినై బాపూజీ కళ్ళల్లో.

"సంగతేమిటి చెప్పు బాపూ." అనునయంగా అడిగాను.

"మరేమో, చెల్లాయేమో, నిన్న పొద్దున పక్కవాళ్ళింటి కెళ్లింది మామయ్యా, వాళ్ల సీత, తాయారూ, రామలక్ష్మి బొమ్మలపెళ్లి చేతాం రమ్మని పిలిస్తేనూ. మళ్లీ ఊరికే వెళ్లలేదు చెల్లాయైనా వాళ్ళను దేబిరించుకుంటూ; కంది పప్పూ, బెల్లం, అటుకులూ, అప్పడమ్ముక్కలూ, చక్కపొడీ ఇన్ని తీసుకు మరీ వెళ్లింది, ఎలానూ ఆడపెళ్లివాళ్లం గదా అని. ఆ సీత మరీ కుళ్లుమోతుపిల్ల, ఆడుకున్నంతసేపూ ఆడుకుని, అన్ని పప్పులూ తినేసి 'పాపం పప్పులు తీసుకుని మా యింటికి పరిగెత్తుకొచ్చావు, వండుకునే గిన్నెకు గతిలేక!' అని దెప్పిపొడిచిందిట మామయ్యా! ఆమాటలు వింటుంటే చెల్లాయితోపాటు నాకూ ఏడుపొచ్చింది! మనమేం లేనివాళ్ళమా చెప్పు! ఒకళ్ళను పోయి ముష్టడుక్కోటానికి!! రమ్మని పిలిచిందీ తానే, మళ్ళీ తిట్టి వెళ్లగొట్టిందీ తానే! 'అన్నాయ్, నాకో లక్కపిట్టి తెచ్చిపెట్టవురా?' అని జాలిగా బతిమాలుకుంది మామయ్యా, నువ్వుంటే నీకూ గుండె కరిగిపోయేదే!'

నాకూ స్నిగ్ధహృదయం ఉందని గుర్తించి నందుకు ఆ పసివాణ్ణి మనస్సులోనే అభినందించుకున్నాను.

"మిఠాయి కొనుక్కోమని వెనక నువ్విచ్చిపోయిన డబ్బుంటే అదితీసుకుని అప్పటికప్పుడు బజారుకు పరుగెత్తి సరిగ్గా అదేసైజు, అదేరంగు లక్కపిట్టి తెచ్చి చెల్లాయికిచ్చి ఆడుకోమన్నాను. 'ఇహాను సీతగారింటి గడప తొక్కితే వొట్టే' అని వొట్టేసుకున్నా మిద్దరమూ. నేను బజారు కెళ్ళటం చూసింది గావును, ఏం తెచ్చానను కుందో ఏమో మనింటికి పరిగెత్తుకొచ్చింది మామయ్యా. ఈ సీతకు బొత్తిగా సిగ్గేలేదేం? వచ్చింది ఊరుకో వచ్చా? చెల్లాయి తీరా అన్నం వొండుకుంటున్న లక్కపిట్టి తనదేనని రాగాలు పెట్టటమే కాకుండా యింటికి పరిగెత్తి వాళ్లమ్మనుగూడా వెంటబెట్టుకొచ్చింది పోట్లాటకు. మరామె ఏం మాట్లాడిందో ఏమో, చెల్లాయి సీతాం లక్కపిట్టి దొంగిలించుకొచ్చినట్టు తేల్చుకున్నా రిద్దరూ! 'కాదే అమ్మా' అని నేను చెబుతూనే